# ఉదయకిరణాలు

పిల్లలంతా కలిసి, గోలగా చేస్తున్నారు. ప్రభవ వద్దని చెప్తోంది. పెద్దవాళ్ళు రాబోవు పిల్లలు ఉన్నారు. శ్రీరామ్, శ్రీలక్ష్మి, సుమతి, పెద్దవాళ్ళు రాంబాబు పిల్లలు ఉన్నారు. సుగుణ, సింధు, విద్య, ప్రశాంత్ ప్రభవ కొడుకు.



పిల్లలకు వద్దని కార్యక్రమం ఎప్పుడూ ప్రభవే మామూలైపోయింది. శ్రీరామ్ అల్లరి వాడు. ప్రశాంత్‌ని ఏడ్పించటం ఆ కుర్రవాడికి హాబీ. ప్రభవ పిల్లలందరికీ కూర అన్నం కలిపి, అందరి కంచాల్లో కోడిగుడ్లు వేసింది.

"ఒరేయ్! ప్రశాంత్! అలా చూడరా ఆ గోడమీద నీనీడ భలే తమాషాగా ఉంది కదూ!" అంటూ ఊరించాడు రాము.

ప్రశాంత్ అమాయకంగా అటు చూశాడు.

శ్రీరామ్ ప్రశాంత్ కంచంలో కోడిగ్రుడ్డు తీసుకొని సగం కొరికివేశాడు. ప్రశాంత్ ఏదో చెప్పబోయి గ్రుడ్డు సగమే వుండటం చూసి "అయ్యో!..." అన్నాడు.

"అదిగో! అటు చూడు పిల్లి పారిపోతోంది" అన్నాడు శ్రీరామ్.

ప్రశాంత్ అటు చూశాడు. శ్రీరామ్ మిగిలింది తీసుకోబోతుండగా చేయి కడుక్కొని వస్తున్న ప్రభవ చూసింది. ప్రశాంత్ బిక్క మొహం వేసుకొని చూస్తున్నాడు. పిల్లలంతా గొల్లున నవ్వుతున్నారు.
ప్రభవ మనస్సు కలుక్కుమంది.

'ఎందుకు వీడంటే ఈ పిల్లలందరికీ ఇంత లోకువ' అనుకోగానే ఎక్కడలేని కోపం వచ్చింది.

"శ్రీరామ్! వాడిని ఏడిపించకు...నీ గ్రుడ్డు వాడికిచ్చేయ్..." అంది.

శ్రీరామ్ ఓసారి నిర్లక్ష్యంగా చూసి నవ్వాడు. వాడి నవ్వుతో సహనం చచ్చిపోయి పిచ్చికోపం వచ్చింది ప్రభవకి. ఆ చెంప ఈ చెంప వాయించింది. సరిగ్గా అప్పుడే రాఘవ వచ్చి గుమ్మంలో బొమ్మలా నిలబడిపోయాడు. శ్రీరామ్ గొంతు పెద్దది చేసి ఏడుస్తున్నాడు. వదినలు ముగ్గురూ వచ్చి నిలుచున్నారు. ప్రభవ తప్పుచేసిన దానిలా తలవంచుకొంది.

ఇన్నాళ్ళు భార్య చెల్లెల్ని గురించి ఎన్ని చెప్పినా ఏమన్నా తను పట్టించుకోలేదు. పెద్దగా భార్యను మందలించేవాడు. కాని, ఈ రోజు కళ్ళారా చూసింది నిజం. రాఘవకు విపరీతంగా కోపం వచ్చింది.

ఏడుస్తున్న కొడుకుని లేపి దబ...దబ... బాదేస్తున్నాడు. ప్రభవ అడ్డు వెళ్ళబోయింది. తీక్షణంగా చూశాడు రాఘవ.

'వాడి యింట్లో ఉంటూ వాడినే కొడతావా?' అన్నట్లుందా చూపు. "ఎప్పుడూ యింతే... నీ కళ్ళు వీడిమీదే వుంటాయి...ఇక మంచి నీ బిడ్డకు వేరుగా పెట్టుకోమ్మా!...'మాది' అను కోవడానికి లేదు వెధవ కొంప...పదరా మొహం కడుగుతాను..." అంటూ కొడుకుని లాక్కుపోయింది రమ.
పెద్దన్నయ్య బయటకు వెళ్ళిపోయాడు.

నా బిడ్డకు వేరే పెట్టుకోవాలా? అంటే??... నా బిడ్డ అంటరాని వాడా? ఎందుకు వీడంటే అందరికీ కోపం. పెద్దవాళ్ళ దగ్గర మంచి పిల్లల వరకూ అందరికీ లోకువే...తండ్రిలేని బిడ్డ విలువ...భర్తలేని భార్య విలువ ఇంతేనా?....
చెంపల మీద కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి.

"ఆవిడకు లేని సుఖాలు అందరూ అనుభవిస్తున్నారని...అంతా ఆ ప్రభవమ్మగారి మూలంగా వచ్చింది" అప్పుడే వచ్చిన చిన్నన్న రాంబాబుతో లేనివి కూడా కల్పించి చెబుతోంది చిన్న వదిన సుభద్ర.
మూడవ వదిన సానుభూతిగా చూసి వెళ్ళిపోయింది.

ప్రభవ మనస్సు కలుక్కుమంది.
'ఎందుకు వీడంటే ఈ పిల్లలందరికీ ఇంత లోకువ' అనుకోగానే ఆమెకి ఎక్కడలేని కోపం వచ్చింది.

పిల్లలు తలలొంచుకుని భోజనాలు చేస్తున్నారు. "అమ్మా! కోడిగ్రుడ్డే...." అంటూ ఏడుస్తున్న కొడుకుని రెండు బాది చెయ్యి మూతి కడిగి, పెరట్లోకి లాక్కెళ్ళింది.

ఆ దెబ్బలకు హడలి పోయి తల్లిని హత్తుకుపోయాడు ప్రశాంత్. "నేనేం పాపం చేశానని వాకీ గుండె కోత..." అంటూ ఆమెహృదయం రోదిస్తోంది. మూతి వస్త్రమీద కూర్చుని కొడుకుని ఒడిలో పడుకోబెట్టుకొంది.

బాబు తల్లి కళ్ళలోకి చూస్తున్నాడు బెదురుగా. ఆ తల్లిచూపులు ఎక్కడో, శూన్య ప్రపంచంలో విహరిస్తున్నాయి. కరిగిపోయిన గతం కళ్ళముందు కదిలింది...

** ** **

నారాయణరావుగారిది ఉన్నతమైన కుటుంబం.

ఆయన ఆశలు ఉన్నతమైనవి. ఆయన ఆలోచనలు ఉన్నతమైనవి. ఆయన పరువూ, ఊరిలో పేరు ఉన్నత మైనవి. ఊరిలోకెల్లా ఆయన మండువా లోగిలే పెద్దది.

ఆయనకు ఆరుగురు సంతానం. ముగ్గురు కూతుళ్ళు. ముగ్గురు కొడుకులు.

ఆయనకు 20 ఎకరాల తోట రకరకాల ఫల వృక్షాలతో నిండి ఉండేది. 30 ఎకరాల పొలం ఉంది. ఆఖరి పిల్ల పుట్టీపుట్టగానే భార్య స్వర్గస్తురాలైంది.

అందరికంటే పెద్దపిల్ల ప్రసూన. తర్వాత అబ్బాయి రాఘవ. రెండో కొడుకు రాంబాబు. మూడవ కొడుకు రాజేంద్ర. ఆతర్వాత ప్రభవ, ప్రభవ తర్వాత ప్రణతి. పిల్లల విషయంలో ఆయన ఊహలు ఆకాశంలో విహరించేవి. ఆడపిల్లలకి మంచి మంచి సంబంధాలు చెయ్యాలి. డాక్టర్లు, యింజనీర్లు అల్లుళ్ళు కావాలి. కొడుకులు బాగా చదువుకోవాలి. ఉన్నత పదవుల్లో వాళ్ళు వెలిగిపోవాలి. విమానాల్లో విహరించాలి. వాళ్ళ జీవితాలు నందనవనంలా కళకళ లాడాలి. నవ్వుతూ కలకాలం బ్రతకాలి. ఆయనఊహల్లోనే విహరించేవారు.

పెద్ద పిల్ల పెళ్ళి కెదిగింది. సంబంధం వచ్చింది. కుర్రాడు డాక్టరు. కొద్ది రోజుల్లో అమెరికా వెళ్ళబోతున్నాడు.


ఆయన ఊహలకు రెక్కలొచ్చాయి. మరేమీ ఆలోచించలేదు.

చిల్లర లాంఛనాలు కాకుండా 'లక్ష' కట్నం అని మాట్లాడుకొన్నారు. ఇతర లాంఛనాలు పాతిక వేలు.

బ్యాంకు బాలెన్సు 70 వేలు తీశారు. పొలం అమ్మ చూపితే అంతా అవసరాన్ని కనిపెట్టి తక్కువ ధరకు అడుగుతున్నారు. ఆయనకు అంత తక్కువ ధరకు ఇవ్వడం ఇష్టం లేదు. అందుకేఆయన వియ్యాలవారినే బ్రతిమాలుకున్నారు.

'పెళ్ళి జరుగుతుంది. కాని మిగిలిన కట్నం 50

పోటీకార్టూన్లు : జి. రాం మోహన్



వేలు యిచ్చేంతవరకు కార్యంలాంటి ఏర్పాట్లు చేయ బడవు' అన్నారు.

ఆయన సంతోషంగా ఒప్పుకొన్నారు.

ఆ పెళ్ళికోసం ఆయన 10 వేలు అప్పుచేశారు.

వాళ్ళు రెండు సంవత్సరాలు ఎదురు చూశారు. ఈయన కట్నం బాపతు డబ్బు ఇవ్వలేక పోయారు.

మూడవ సంవత్సరంలో అల్లుడు అమెరికా నుండి వచ్చాడు. కట్నం గురించి మామగార్ని గట్టిగా హెచ్చరించి భార్యను కూడా అమెరికాకు తీసుకెళ్ళి పోయాడు.

జనం "కూతుర్ని అల్లుడు వదిలేశాడు" అని గుసగుసలాడేవారు. కూతురు కాపురానికి వెళ్ళిన తర్వాత, ఆయన గర్వంగా తలఎత్తారు.

కాలం పరుగెడుతోంది.

పెద్ద పిల్లపెళ్ళికి చేసిన అప్పు రెండింతలయ్యింది. పంటలు లేవు. మగ పిల్లల చదువులు, అవసరాలు, అధికం కావటంతో, ఒక్కో ఎకరం చొప్పున, 20 ఎకరాలు హరించుకు పోయాయి.

రాఘవ ఎం.ఎ. పూర్తిచేశాడు. ఉద్యోగాల వేట.

రెండవవాడు డిగ్రీ పూర్తిచేసి చదవనా మానవా అని ఆలోచిస్తున్నాడు. మూడవవాడు కాలేజీలో చేరాడు.

ప్రభవ పుష్పవతి అయింది.

సరిగ్గా ఆరోజుల్లోనే, తోట రోడ్డు వారగా వుందని గవర్నమెంట్ వారు అమ్మమని వత్తిడి చేశారు.

నారాయణరావుగార్కి అన్ని సమస్యలు ఒకేసారి వచ్చిపడ్డాయి. వ్యవధి లేకుండా గవర్నమెంట్ వారి వత్తిడి. వారి దాటికి తట్టుకో లేక అమ్మేశారు. 60 వేలు మాత్రమే యిచ్చారు వాళ్ళు. ఇప్పుడు ఆయనకు ఉన్నదల్లా 10 ఎకరాలభూమీ, 60 వేలరూపాయలు.

పెళ్ళికెదిగింది ప్రభవ. ఈ మొత్తానికే డాక్టరు అల్లుడో, ఇంజనీరు అల్లుడో వస్తాడా? అని ఆయన విచారించలేదు. ప్రయత్నాలు మొదలయ్యాయి.

సంవత్సరం లోపు మిగిలిన 30 వేలూ ఇచ్చేయాలి. అప్పటి వరకూ అమ్మాయి పుట్టింటిలోనే ఉంటుంది. ఇది వాగ్దానం.

ఓ యింజనీరు సంబంధం దొరికింది. కుర్రాడు దుబాయ్‌లో నెలకు 10 వేలు సంపాదిస్తున్నారు. ఖరీదు 'లక్ష' రూపాయలు.

సరిగ్గా అప్పుడే రాఘవకు లెక్చరర్ ఉద్యోగం రావటం ఓ సంబంధం రావటం జరిగింది. కట్నం కొంత భూమి రూపేణా, కొంత రొక్కం యిచ్చారు. ఆ రొక్కం 30 వేలు, ఈ 60 వేలూ కలిపారు. పెళ్ళి ఖర్చుకని 20 వేలు తీసివేసి మిగిలిన 70 వేలు వారికే ఇచ్చేశారు. ఇతర లాంఛనాలు లేవు.

సంవత్సరం లోపు మిగిలిన 30 వేలూ ఇచ్చేయాలి. అప్పటివరకూ అమ్మాయి పుట్టింటిలోనే ఉంటుంది. ఇది వాగ్దానం.

ప్రభవ పెళ్ళి ఇంజనీరు జయరామ్‌తోను, రాఘవ పెళ్ళి రమతోనూ జరిగిపోయాయి. పెళ్ళికి పెద్దపిల్ల, అల్లుడూ రాలేదు. రమ కాపురానికి వచ్చేసింది. కానీ ప్రభవ అత్తవారింటికి వెళ్ళలేదు.

రాంబాబు డిగ్రీతో ఆపేసి బ్యాంకులో ఉద్యోగం సంపాయించుకొన్నాడు. తెగించి ఆ పది ఎకరాల భూమి అమ్మలేకపోయారు నారాయణరావుగారు. అదే యిపుడు వారికున్న ఆస్తి.

** ** **

రాంబాబు పెళ్ళి కుదిరింది. కట్నం పాతిక వేలు మాత్రమే. అదయినా అమ్మాయి పేర బ్యాంకులో వేయాలని వారి కోరిక. రాంబాబుకి సుభద్ర నచ్చింది. నారాయణరావుగారు ఏమీ అనలేక పోయారు. ముహూర్తాలు పెట్టుకొన్నారు. యిద్దరు అల్లుళ్ళకూ టెలిగ్రామ్స్ యిచ్చారు.

వారి పెద్ద అమ్మాయి పుట్టింటి మొహం చూసి ఏడు సంవత్సరాలు దాటింది. అప్పుడప్పుడూ క్లుప్తంగా లెటరు వ్రాసేది. 'నేను సుఖంగా ఉన్నానని'. ఇపుడు వారికి యిద్దరు పిల్లలు. ఆ పిల్లలు ఎలా వుంటారో నారాయణరావుగారికి తెలియదు. 'మా అమ్మాయి అమెరికాలో భోగభాగ్యాలు అనుభవిస్తూ సుఖంగా కాపురం చేసుకొంటోంది. అలాగే రెండవ అల్లుడూ వస్తాడు అమ్మాయిని తీసుకెళతాడు. పరాయి దేశాల్లో ఉన్నపుడు అస్తమానూ రావడం కుదరదు'. ఇదీ ఆయన అందరికీ చెప్పుకునే జవాబు.

పెద్ద అల్లుడు దగ్గరి నుండి ఎలాంటి సమాచారం లేదు. కానీ రెండవఅల్లుడు రేపు పెళ్ళిఅనగా వచ్చాడు. నారాయణరావుగారి ఆనందానికి అవధులు లేవు. సంతోషానికి పగ్గాలేలేవు 'తనుఅనుకొన్నట్లుగానే ప్రభవ. జీవితం సుఖప్రదం కాబోతుంది' అనుకున్నారు. ఇంకేం అల్లుడిగారికి ఎక్కడ లేని మర్యాదలు జరిగాయి.

రాంబాబు పెళ్ళికి అందరూ బయలుదేరారు. జయరామ్ "జ్వరం వచ్చే లాగుంది...నేను రాలేను. ప్రభవని తోడు ఉంచి వెళ్ళమని' చెప్పాడు.

కార్యం అదీ కాకుండా ప్రభవను ఉంచడం నారాయణరావుగారికి ఇష్టం లేదు. అలా అని పంతాలకు పోతే అల్లుడికి ఏం కోపం వస్తుందో?ఎన్నో విధాల ఆలోచించి ప్రభవకి ఎన్నో హితబోధలు చేసి ప్రణాలిని ఉండమన్నారు. ఉండనని గోల చేసింది. ఇంటి పెద్ద కోడల్ని వదిలి వెళ్ళడం బాగుండదు. రాజేంద్ర కాలేజీలో చదువుతున్నాడు. ఎగ్జామ్స్ దగ్గరికొస్తున్నాయని రాలేదు. చేసేదేం లేక ప్రభవని ఉంచి అంతా పెళ్ళికి వెళ్ళారు.

** ** **

ప్రభవకి చెప్పలేనంత సిగ్గుగా ఉంది.

అతను తన మెడలో తాళి కట్టిన భర్త. అయినా ఇంత వరకు అతని ఎదుట పడలేదు.


వంటగదిలో కూర్చుని తెగ ఆలోచిస్తోంది ప్రభవ.

"ప్రభవా"! ఉలిక్కిపడి చూసింది. జయరామ్ గుమ్మం దగ్గర విలబడి ఉన్నాడు. చిరునవ్వుతో ప్రభవని చూస్తున్నాడు. ప్రభవ ఖంగారుగా లేచి విలబడింది. కాళ్ళు ఎందుకో వణికి పోతున్నాయి.


"మీ వాళ్ళు వచ్చిన వెంటనే మన ప్రయాణం" అతను దగ్గరకొచ్చేశాడు. ప్రభవ నమ్మలేనట్లుగా అతని కళ్ళలోకి చూసింది.

ఆ కళ్ళలో ప్రేమా, ఏదో చెప్పలేని, ప్రభవ ఎప్పుడూ చూడని భావం కలగాపులగంగా కనిపించాయి. ఆమెకిది కొత్త అనుభవం.

పోటీకార్టూన్లు : జి. రాం మోహన్



## పోటీకార్టూన్లు : టి. ప్రసాద్ (ఆదిత్య)




"టూ ఇయర్స్....నన్ను నేను కంట్రోల్ చేసుకోవడానికి ఎంత అవస్థ పడ్డానో తెలుసా?....అనుక్షణం నీ తలపే...ఇక ఉండలేక మా వాళ్ళకు తెలీకుండా నీ దగ్గరికి వచ్చేశా...ప్రభా! కలలో ఎంత అల్లరి పెట్టేదానివో తెలుసా...? ఓ మైడియర్ డార్లింగ్... ఐ లవ్ యూ...ఐ లవ్ యూ...డార్లింగ్...." అతను తనని కంపించి పోతున్నాడు. ఆమెను తన బాహువుల్లో బంధించి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు.

ప్రభ నిలువెల్లా వణికి పోతోంది. వళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. ఏమిటేది ఏమైపోతోంది తను. ఆయన ఏం చేస్తున్నారు తనని. కళ్ళముందు చీకట్లు ముసురుకుంటుండగా భయంతో స్పృహ కోల్పోయింది.

ప్రభ స్పృహలోకి వచ్చి చుట్టూ చూసింది.

తను బెడ్ మీదుంది. తను నగ్నంగా ఉంది. జయరామ్ తన ప్రక్కనే ఉన్నాడు.

అతను తనని లొంగ తీసుకున్నాడో లేక తనే అతనికి లొంగిపోయిందో అర్థం కాలేదు... ఆడ మగ సంపర్కం అంటే తెలియనంత వెర్రిదేం కాదు ప్రభ. అది సహజమని, సృష్టి రహస్యమని తెలుసు... అయినా తను ఉన్న పరిస్థితి, సంప్రదాయం తలచుకొంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ప్రభా!" అతను ఆప్యాయంగా ఆమె కళ్ళు తుడుస్తున్నాడు.

ప్రక్కన పడి ఉన్న చీరనందుకుని బాత్‌రూమ్‌లోకి పరుగుతీసింది. గంట గడిచినా ఆమె రాలేదు.

"ప్రభా! ప్లీజ్! తలుపు తియ్యి. ప్లీజ్..." అతను బ్రతిమాలగా తలుపు తీసింది. చేతుల్లో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ప్రభా! నీకేమన్నా పిచ్చా...ఎంతో దారుణం జరిగిపోయినట్టుగా ఎవడో పరాయివాడు వచ్చి నిన్ను రేప్ చేసినట్లుగా ఇంత ఏడుపా...? మైగాడ్. ఇంత చేటు తనమా! నేను నీ భర్తని, నీ శరీరం మీద సర్వ హక్కులున్నాయి. నువ్వు నా దానివి. ఆఫ్టాల్ కట్నం కోసం నిన్ను వదులుకోను...మీ వాళ్ళు రాగానే నిన్ను దుబాయ్ తీసుకుపోతాను. ప్రామిస్. నవ్వు...ఏది... ఏది..." అంటూ ఆమెను నవ్వించాలని ప్రయత్నించాడు.

ఆమె నవ్వలేదు. అతని గుండెకు హత్తుకు పోయింది. ఆమె తీవ్రంగా ఆలోచిస్తోంది.

"అతను తన పవిత్రతను మలినం చేశాడు. తను కన్యత్వం కోల్పోయింది. ఇది సహజమా! పాపమా! ఒక భర్త భార్యని రేప్ చేస్తే ఏమిటి శిక్ష...ఇది దారుణమా? సహజమా?...తప్పు అతనిదా? తనదా? ఇది నాన్నగారికి తెలిస్తే, ఏమంటారు...అయినా ఆయన తనను తీసుకెళతానని ప్రామిస్ చేస్తున్నారు....ఎందుకింతగా ఆలోచిస్తోంది తను..." తనలో తనే నవ్వుకుంది.

"ప్రభా! సినిమాల్లో బాత్‌రూమ్ సీను చాలా నచ్చుతుంది—నాకు. ఎందుకో తెలుసా! ఆ బాత్‌రూమ్‌లో వున్నది వాళ్ళుకాదు మనమేనని ఊహించుకుంటూ నేను, నీవు ఈ రోజు కలిసి స్నానం చేద్దామా...షవర్....అయ్యో లేదుగా...—"

అతను అమాయకంగా అంటూ తమాషాగా పైకి చూస్తుంటే ఆమె కిల కిలమంది. ఆమె సిగ్గు సంకోచం రెక్కలొచ్చి ఎగిరిపోయాయి.

అది మొదలు...


ఆమె వంట చేస్తుంటే దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేవాడు. నిముషం వదల్లేనట్లు ఉండేవాడు. ఆమె స్నానం చేసి వస్తే ఆమెకు ఏ కలర్ చీర నప్పుతుందో సెలక్ట్ చేసి ఉంచేవాడు. ఆమె ముస్తాబు పూర్తి కాగానే..."హాఁ! మై స్వీట్ డార్లింగ్" అంటూ ఆమెను చేతులతో ఎత్తి గిర గిరా తిప్పేవాడు. ఆమె కళ్ళు తిరుగుతున్నాయంటూ అతనిగుండెలకు హత్తుకు పోయేది.

అలా......

ఆ రెండురోజులూ పగలూ రాత్రీ, రాత్రీ పగలూ తేడా లేకుండా స్వేచ్ఛాకాశంలో ప్రణయ విహారం సాగించారు. చందమామకూ, చిరుగాలికీ అసూయ వచ్చి మూతి ముడుచుకున్నాయి.

** ** **

మామగారు వచ్చిన మధ్యాహ్నమే జయరామ్ ప్రయాణమయ్యాడు. తన సూట్‌కేస్ సర్దుకున్నాడు. నారాయణరావుగారు మెల్లిగా అడిగారు.




"అమ్మాయిని ఎప్పుడు తీసుకెళతారు" అని.

"సీలు చూసుకొని...నేను వెళ్ళగానే లెటరు వ్రాస్తాను" విచిత్రంగా నవ్వేసి వెళ్ళిపోయాడు.

'భర్త ఎపుడు వచ్చి తీసుకెళతాడా' అని క్షణమొక యుగంగా గడుపుతోంది...ప్రభ. నారాయణరావు గారు అల్లుడి నుండి వచ్చే లెటరు కోసం ఎదురు చూస్తున్నారు. రెండు నెలలు గడచినా ఏ సమాధానం లేదు.

"నాన్నగారూ! ఆ పది ఎకరాలు అమ్మి ప్రభని అత్తవారింటికి పంపించండి".

ముఖం కందగడ్డలా చేసుకొని అన్నాడు రాఘవ. నారాయణరావుగారు కొడుకు ముఖంలోకి విచిత్రంగా చూశారు. "ప్రభని పంపిస్తాం సరే...మరి ప్రణతిని ఏం చేస్తావ్!?"

"ప్రస్తుత పరిస్థితులలో మన పరువు బజారున పడకుండా ఉండాలంటే ప్రభని అక్కడికే పంపేయాలి".

"అంత మునుకు పోయే పరిస్థితి ఇపుడే మొచ్చింది".

"ప్రభకి మూడవనెలని రమ చెప్పింది" రాఘవ మరి నిలువలేక బయటకు వెళ్ళిపోయాడు.

ఆయన షాక్ తగిలినట్లుగా నోటమాటరాక వెర్రిగా కొడుకు వెళ్ళిన వైపేచూస్తూ ఉండిపోయాడు.

ఆయనలో చలనం వచ్చింది. చిగురంత ఆశ మొలకెత్తింది. ఎవరి సంతానం మీద వారికి ఆనందం కదా! అన్నీ చక్కబడుతాయి. అనుకొని అన్నీ వివరంగా అల్లుడికి ఉత్తరం వ్రాశారు.

వారం రోజుల్లో జవాబు వచ్చింది. అందులో ముఖ్య సారాంశం ఇది.

"మీ అమ్మాయి గర్భవతి అని వ్రాశారు. ఇదెలా సంభవం అని నేనడుగను...మిగిలిన కట్నం బాపతు 30 వేలూ నయాపైసలతో సహా ఇచ్చేస్తే...మీ అమ్మాయి గర్భంలోని బిడ్డనాది కాకున్నా నేను భరించగలను...ఏ విషయం మీరే ఆలోచించుకోండి"....

నారాయణరావుగారి హృదయం కుత కుత లాడి పోయింది.

పాలు విరిగిన తరువాత బాధపడి ప్రయోజనం ఏముంది. ఇదేమి ఎరుగని ప్రభవ భర్తకోసం ఎదురు చూస్తూ ఊహాలోకంలో విహరిస్తూ వుంది.

కాలం ఎవ్వరితో సంబంధం లేనట్లు పరుగెడుతోంది.

ప్రభవకి మగపిల్లాడు పుట్టాడు. అంతా తండ్రి పోలికే. ప్రభవ మురిసి పోతోంది. భర్త రాకకోసం ఆ పిచ్చి మనస్సు కొండంత ఆశతో ఎదురు చూస్తోంది. తను పడ్డ శ్రమ భర్తతో పంచుకోవాలని తపించి పోతోంది.

నారాయణరావుగారు అల్లుడుకి లెటరు వ్రాశారు. కట్నం ఇచ్చేస్తాం. వచ్చి అమ్మాయినీ పిల్లవాడిని తీసు కెళ్లమని. అల్లుడి నుంచి ఫోటోతో సహా లెటరు వచ్చింది. ఆ ఫోటోలో వధూవరులు జయరామ్, మరో యువతి. ఆయన నెత్తిన పిడుగు పడ్డటయింది. ఆ లెటరులో యిలా వుంది.

"ఇప్పటికే ఆలస్యం చేశారు. అయినా నాకు కోపం లేదు. ఇక్కడ పేరుమోసిన కంపెనీలో నెలకు రెండు వేలు సంపాదిస్తూన్న 'జానీ'ని పెళ్ళి చేసు కున్నాను. మీ అమ్మాయిని ఏం అన్యాయం చెయ్యను. అలా అని 'జానీ'ని వదులుకోలేను. నాకు డబ్బే ముఖ్యం..."

ఇంక చదవలేక కూతుర్ని పిలిచి లెటరు ఆమె చేతిలో పెట్టారు.

"బాబూ! డాడీ లెటరు వ్రాశార్రా! ఇప్పటికి మన మీద దయ కలిగినట్లు వుంది. అయ్యగార్కి. అల్లరి చెయ్యకేం...బుద్ధిగా పడుకో..." నిద్ర పోతున్న బాబుని మృదువుగా ముద్దాడి లెటర్ చదవసాగింది.

చదివి నమ్మలేనట్లుగా ఫోటో చూసింది. కొయ్య బారిపోయింది. ఇంత మోసమా? తాళికట్టిన భర్తే భార్యను ఎగతాళి చేయుటమా? ఇంత దారుణంగా

*తన ఉనికిని గుర్తుచేస్తూ బాబు కెవ్వు మన్నాడు. తల్లి హృదయం మేలుకొంది. ఈ పసివాడి కోసమే తను బ్రతకాలి. అనుకొని బాబుని గట్టిగా గుండెలకు హత్తుకుంది.*

ప్రవర్తిస్తారా మనుష్యులు...ఇంక వివాహ వ్యవస్థకు అర్థం ఏముంది? డబ్బు మీద ఇంత వ్యామోహమా! ఆది నుంచి యిలాగే ఆడది మగవాడి తియ్యని మాటలకు మోసపోతోంది. తప్పచేసిన వాళ్ళు విజయగర్వంతో పొంగి పోతుంటే, ప్రకృతి విధించిన శిక్షను అనుభవిస్తూ వీళ్ళు క్రుంగిపోతున్నారు....

తన ఉనికిని గుర్తు చేస్తూ బాబు కెవ్వుమన్నాడు. తల్లి హృదయం మేలుకొంది. ఈ పసివాడి కోసమే తను బ్రతకాలి...అనుకొని బాబుని గట్టిగా గుండెల హత్తుకుంది.

నారాయణరావుగార్కి కోర్టు చుట్టూ తిరగటం యిష్టంలేదు. దానివల్ల పరువు నష్టం తప్ప ప్రయో జనం లేదు. అందుకే కామ్‌గా ఊరుకున్నాడు.

పరుగెడుతున్న కాలంతో పాటు ఎన్నో జరిగి పోతూ వుంటాయి.

రాజేంద్ర కానీ కట్నం లేకుండా, ఎవరి ప్రమేయం లేకుండా తన క్లాస్‌మేట్ సుగంధిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. దీంతో నారాయణరావుగారి నడుం విరిగినట్లు అయింది. ఆయన బయటికి వెళ్ళలేక పోతు న్నారు. భూమి కౌలుకిచ్చేశారు. ప్రణతి పట్టుబట్టి కాలేజీలో చేరింది. ఆమె బి.యస్.సి. చదువుతోంది.

తనకి ఏం కావాలన్నా అది సాధించుకొనే ఇచ్ఛితమైన వ్యక్తిత్వం ఆమెది.

చెల్లిని చూడగానే జలజలా కన్నీళ్ళు రాలాయి. తల్లిలా ఆప్యాయంగా అక్క కన్నీళ్ళు తుడిచింది. లోపలికి తీసుకెళ్ళింది. ప్రణతి బలవంతంపై ఇద్దరూ భోజనాలు చేశారు. ఆ రోజు గొడవంతా చెల్లితో చెప్పు కొంది.

"ఈ గొడవ జరిగింది నాన్నగార్కి తెలుసా?" అడి గింది ప్రణతి.

"తెలుసు" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది ప్రభవ.

"తెలిసినా ఆయన యిలాంటివి పట్టించుకోరు" అంటూ నిద్రకుపక్రమించింది ప్రణతి.

** ** **

"రేపు కాలేజీకి సెలవు పెట్టి యింటి దగ్గరే వుండాలి" అంటున్న తండ్రివైపు వింతగా చూసింది ప్రణతి. "ఏమిటి విశేషం?" అందామనుకుని ఊరుకొని కాలేజీకి వెళ్ళిపోయింది.

సాయంత్రం రాగానే అక్కని ఆరా తీసింది.

"రేపు నిన్ను చూసుకోవడానికి పెళ్ళి వారొస్తున్నారు..."

"హార్రే...!!నాకు పెళ్ళన్నమాట...బావుంది. కట్నం ఎంత?"

"మామూలే!...కుర్రవాడు బాగున్నాడు...ఇదిగో ఫోటో..."

"ఊ !...బాగానే వున్నాడు ఎందుకంటే యితని ఖరీదు లక్ష కనుక...అవునూ...అంత డబ్బు మన కెక్కడిదే?..." తమాషాగా గొంతు తగ్గించి అడిగింది ప్రణతి.

"ఆ విషయాలన్నీ నీకెందుకే?....అన్నీ నాన్న గారు చూసుకొంటారులే..." ముసిముసిగా నవ్వింది అక్క.

"నాన్నగారేం చూస్తారు. కాబోయే పెళ్ళికూతుర్ని నేనే తెలుసుకోవాలి చెప్పు"

"ఆ పది ఎకరాలు యిచ్చి చిన్న నదిన్ని బ్రతి మాలుతారనుకుంటా...మిగిలింది..."


"ఆ తర్వాత ఏం జరుగుతుందో నీకూ నాకు తెలుసు...అవునూ ఈ అల్లుడెక్కడుంటాడు లండన్‌లోనా? న్యూయార్క్‌లోనా?"

"నాకూ తెలీదే!..." అంటూ వచ్చే కన్నీళ్ళు ఆపుకొంది ప్రభవ.


** ** **

"ఏమిటది ఇంకా రాలేదు. సెలవు పెట్టి వస్తానన్న ప్రణతి సాయంత్రంనాలుగుగంటలు అవుతున్నారాలేదు. నీకేమన్నా చెప్పిందా తల్లీ!" ప్రభవనడిగారు నారాయణ రావుగారు....ప్రభవ బుర్ర అడ్డంగా వూపింది. ఆయనకు చెప్పలేనంత నీరసం వచ్చేసింది. అందరి హృదయాల్లో ఆందోళనగానేవుంది "ప్రణతి ఏమైంది? ఏమైంది?" ఇదే ప్రశ్న. 5 గం.లకు పెళ్ళివారొచ్చారు. నారయణరావుగార్కి పిచ్చెక్కినట్లుగా ఉంది. వాళ్ళు

పోటీ కార్టూన్లు గోపాలకృష్ణ



పోటీ కార్టూన్లు — గోపాలకృష్ణ




హడావిడి చేస్తున్నారు....

దూరంగా ప్రణతిని చూసిన ఆయన ముఖం, వెలిగి వచ్చిన ఆరిపోయింది. గుమ్మం దగ్గర ఆగిన ప్రణతిని ఆ చెంపా ఈ చెంపా వాయించేశారు.

వచ్చిన వాళ్ళు వచ్చినట్లే వెళ్ళారు. ప్రణతి మెడలో పచ్చగా మెరుస్తున్న మంగళసూత్రాలు ఆయన్ని వెక్కిరిస్తున్నాయి. అంతా బొమ్మల్లా చూస్తున్నారు. ఆ పసుపుత్రాడును తెంపుదామనుకున్న ఆయన చేతిని మధ్యలోనే ఆపింది ఓ బలమైన చెయ్యి.

"ఇంతవరకూ ప్రణతి మీ అమ్మాయి కావచ్చు. తాళి కట్టిన మరుక్షణం నా భార్య ఆమె. నా భార్యమీద ఈగవాలినా సహించలేను". గంభీరంగా పలికింది సురేంద్ర గొంతు.

"నీ భార్యా...!"నారాయణరావుగారు ఒత్తి పలికారు. ఆయన కోపంతో నిలువెల్లా వణికి పోతున్నారు. 'ఈ పిల్లలు ఎంతకు తెగిస్తున్నారు. పరువు ప్రతిష్ఠల గురించి కాస్తయినా ఆలోచించరేం...'

"ప్రణతీ! మన పరువేం కావాలనే యిలా చేశావు?" బాధగా అన్నాడు రాఘవ.

"పరువా!...పరువు అంటే ఏమిటన్నయ్యా! యిస్తానన్న కట్నం పూర్తిగా యివ్వక...ఆడపిల్లలు లోపలి గదుల్లో కుమిలిపోతుంటే...ఈ వరకట్నం మూలంగా భర్త ఆదరణకి దూరమైన ప్రభవక్కయ్య లా, ఆ కట్నం గురించి భర్త అనుక్షణం హింసిస్తుంటే ప్రతి క్షణం మానసిక క్షోభను అనుభవిస్తూ పుట్టింటికి దూరమై పోయిన ప్రమావక్కయ్యలూ ప్రతి యింట్లోనూ వుంటే అదే పరువన్నయ్యా...! ఈ ప్రణతి ఆ కన్నీళ్ళకు దూరమయి పోయిందనేగా మీ అందరి బాధ"....

"నోర్ముయ్....." ప్రణతి చెంపను తాకబోతున్న రాఘవ చెయ్యి మధ్యలో ఆగిపోయింది...సురేంద్ర కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

"ఎందుకు నోరుమూయాలన్నయ్యా! ఇదే పని రాజన్నయ్య చేస్తే మెదలకుండా ఊరుకొని లోపలకు రానివ్వ లేదా వదిన్ని. మమ్మల్ని గుమ్మం దగ్గరే వుంచారేం? ఓహో! ఆయన మగవాడు కదూ! మగవాడు ఏం చేసినా చెల్లుతుంది. ఆడది తెగించకూడదు. తను కన్న కలలు శిథిలమై పోతున్నా మీ పరువు కాపాడాలి ఇదేగా నీ అభిప్రాయం. అదేగా మిస్టర్ రాఘవా ఎం.ఎ.గారూ...!" వ్యంగ్యంగా నవ్వింది ప్రణతి.

"రాఘవా! ఆ నీతిలేనిదానితో వాదనెందుకు? వెళ్ళమను...." అన్నారు రావుగారు.

"వెళతాను... వెళ్ళేముందు నా గుండెల్లో మండుతున్న మంటను చల్లార్చుకుని మరీ వెళతాను..." స్థిరంగా పలికింది ప్రణతి. అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"నాన్నగారూ! ఇస్తానన్న కట్నం యివ్వకేగా మీ పెద్దకూతురు పుట్టింటికి దూరమయ్యింది. దూరాభారం అని చెబుతుంటారే! వీలున్నప్పుడల్లా ఆయన తల్లిదండ్రుల ఇంటికి వస్తున్నారే, కనీసం ఈ పదేళ్ళలో ఒక్కసారి...ఒక్కసారి అక్కని మనకళ్ళ పడనిచ్చాడా మీ పెద్దల్లుడు. ఆవిడ మనసుపడే మూగవేదన మీకు తెలిదేమో! పుట్టిన వూరిని, పుట్టింటివారిని చూడకుండా పదేళ్ళయ్యిందంటే అదెంత యిదవుతోందో మీ రాతిగుండెకు తెలీదునాన్నగారూ....! ఇక ప్రభవక్క.... ప్రకృతివేసిన శిక్షను మౌనంగా భరించి, విమర్శలు తట్టుకోలేక, చావలేక, బ్రతకలేక జీవచ్ఛవంలా మిగిలిన మీ రెండవ కూతుర్ని చూసినా మీ మనస్సు మార్చుకోలేరా! దాని జీవితాన్ని బాగు చెయ్యాల్సిన బాధ్యత మీకు లేదా? కోర్టుకెళితే పరువుపోతుందా? కన్న కూతురు సుఖం కంటె పరువే ముఖ్యమా...! నాన్నగారూ! మీలాగే ప్రతి తండ్రి ఆకాశంలో విహరిస్తూ, ఎండమావుల వెంట పరుగెత్తి పోవాలనుకోవడం ఎంత మూర్ఖత్వమౌతుంది.

అల్లుళ్ళందరూ ఫారిన్‌లోనే ఉండాలనుకొంటే... ఈ దేశం ఏమయి పోతుంది....అంతా డాక్టర్లు, ఇంజనీర్లు అల్లుళ్ళు కావాలంటే మామూలు చదువున్న వాళ్ళంతా ఏమైపోతారు. ఈ దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది. మీ మూడవ అల్లుడు ఫారిన్‌లో లేడని మీరు బాధపడుతూ వుంటే క్షమించండి. మామూలు చదువున్న ఈ సురేంద్రగారిని అల్లుడిగా మీరు ఊహించను కూడా ఊహించుకోలేదు. మీ ఉన్నతమైన అన్నిటికంటే నాకు సురేంద్ర ప్రేమే ఉన్నతమైనదని తలచి అతని వెంట వెళుతున్నాను. సెలవ్...మీరు శపించినా, దీవించినా ఈప్రణతి సుఖంగానేఉంటుంది. వెళుతున్నా" అని మరుక్షణం సురేంద్ర చేతిని పదిలంగా పట్టుకొని మెట్లు దిగింది ప్రణతి. "ఇక మా పిల్లలకి పెళ్ళిళ్ళు అయినట్లే..."ఏదేదో గొణుగుతున్న పెద్ద కోడలి మాటలు వినలేనట్టు కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకున్నారు నారాయణరావుగారు. 'పిల్లలు గురించి కలలు కనడం తన నేరమా?' మొదటిసారిగా ప్రశ్నించుకొన్నారాయన.

ప్రభవ దొడ్డిదారిన వెళ్ళి చెల్లిని కలుసుకుని తన శుభాశీస్సులు అందజేసి ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేసింది.

"ఇప్పుడు నాకు సంతోషంగా వుందే...మీరు సుఖంగా ఉండాలన్నదే నాకోరిక. సురేంద్రగారిని చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉందే.... యువకులంతా యిలా ముందుకు వస్తే ఈ ప్రభవలాంటి వాళ్ళు మిగలరే....మీరు సుఖంగా ఉండాలే కలకాలం...."

"అక్కా, నీవు కూడా సుఖంగా ఉండాలన్నదే నా కోరిక...." అంది ప్రణతి.


"నేను సుఖంగానా...!" పేలవంగా అంది ప్రభవ.

"అదిగో...ఆ నిరాశే ఉండకూడదే. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూట్టం వెర్రితనం. అక్కా! ఒక్క విషయం ఆలోచించు. ప్రశాంత్ యిప్పుడు చిన్న పిల్లవాడు. కాస్త పెద్దయ్యాడంటే, ఒకరి మీద ఆధారపడి బ్రతుకుతున్నామన్న ఊహ వాడికి కలిగితే వాడు ఏమైపోతాడు...అక్కా, వాడ్ని ఎందుకూ పనికిరాని వాడిగా పెంచకే...వాడిని వ్యక్తిత్వం ఉన్నవాడిగా తీర్చిదిద్దు. అదే నా కోరిక...."ఆవేశంగా అంది.

"నన్నేం చెయ్యమంటావే?" గొణిగింది ప్రభవ.

"వాడి కోసం నువ్వేమయినా చెయ్యాలి. బానిసగా వాడు బ్రతక్కూడదు..."

"అందుకు నేనేం చెయ్యాలే...."



కుమార్తె: ఈ ఊళ్ళోకల్లా చక్కని ముక్కునని రాజు నా గురించి అనుకుంటూ వుంటాడు. అమ్మా రాజుని ఇవ్వాళ భోజనానికి పిలవనా?

తల్లి: వద్దు. అతన్ని అలా అనుకోనివ్వడమే మంచిది.

"పిల్లల ఉన్నతికోరుకునే మన శంకరంమాష్టారుతో అన్ని విషయాలు చెప్పాను. ఆయన్ని కలువు...నువ్వు సిరికిదానివి కాకు....ఆయన ఫ్రెండ్ ఒకాయన ఓ స్కూల్ నడుపుతున్నారు అని చెప్పారు...ఓ మంచి టీచర్‌వుంటే చూడమని ఆయన లెటరు వ్రాశారట. నీవు చదువులేని దానివి కాదు. నీ పదో తరగతి అర్హత చాలు...బాబు గురించి ఆలోచించు. వాడు నీ జీవితానికి చిరుదీపం. ఆ దీపం ప్రకాశవంతంగా వెలగాలి...."

చెల్లిని అమాయకంగా కౌగిలించుకుంది ప్రభవ.

"ప్రణతీ! నీవు నా కళ్ళముందు పుట్టి పెరిగిన నా చెల్లివే! ఎంతఎదిగిపోయావే! వెళ్ళవే...కలకాలం చల్లగా బ్రతుకు..." చెల్లిని మరిదిని ఆప్యాయంగా సాగనంపింది ప్రభవ.

** ** **

రైలు పచ్చటి పొలాల మధ్య నుంచి పరుగెత్తుతోంది. ప్రభవ కొడుకునిదగ్గరకు లాక్కునికూర్చుంది. ఆమెకు అంతా కలగా వుంది.

ఈ ప్రయాణానికి ముందురోజు జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది.

రాఘవ, పిల్లలందరికీ క్రొత్త బట్టలు తెచ్చాడు. పిల్లలందరికి యిచ్చాడు. ప్రశాంత్‌కు యివ్వలేదు.

"ప్రశాంత్‌కి తేలేదా....!" నారాయణరావుగారు అడిగారు.

"డబ్బులు సరిపోలేదు అయినా మొన్న వాడి బర్త్‌డేకి తెచ్చానుగా..." అన్నాడు రాఘవ విసుగ్గా...

ఆయన మాట్లాడలేదు.

"అమ్మా! మామయ్య నాకు కొత్త బట్టలు తేలేదే..." చిన్న బుచ్చుకున్న వాడి మొహం చూస్తే గుండె తరుక్కు పోయింది ప్రభవకి.

ఆ క్షణంలో ఆ ఇల్లు ఓజైలులా అనిపించి విడుదల కోసం ఆమె మనస్సు ఆరాటపడసాగింది. మర్నాడు శంకరం మాష్టారుని కలిసింది. ఆయన అన్నీ వివరించారు "ముందు నెల అవస్థపడతావు. నీ జీతం రాగానే సంపిద్దువుగానిలే తీసుకో". అని రెండు వందలు ఆమె చేతిలో ఉంచారు. ప్రభవ ఆయన పాదాలను కన్నీళ్ళతో అభిషేకించింది. తండ్రితో చెప్పింది అంతా ప్రయాణమయ్యాక. ఆయన ఇష్టం లేనట్లుగా తన ఉనికే భరించలేనట్లుగా లేచి లోపలికి వెళ్ళి పడుకొన్నాడు...అదే దీవెన అనుకుంది. ఎవ్వరితోనూ ఏమీ చెప్పలేదు.


"అమ్మా! ఎక్కడికెలుతున్నామే?" అడిగాడు బాబు.

"మన యింటికి బాబూ"!

"అక్కడ ఎవరూ నన్ను కొట్టరుగా...శ్రీరామ్ ఉండడుగా...అత్తల్లా మామయ్యల్లా నన్ను కోప్పడరుగా....కొత్త బట్టలు కొంటావా...?" సంతోషంతో ఏమేమో అడుగుతున్నాడు బాబు.

"అక్కడ నిన్నెవ్వరూ....శాసించరురా. నీది స్వేచ్ఛాజీవితం..." అంటూ కొడుకుని గుండెకుహత్తుకుంది. వాడి కళ్ళలో ఎంత వెలుగు. ఆ ఉదయాన అప్పుడే ఉదయిస్తున్నాడు భాస్కరుడు. ఆ క్షణంలో బాబు కళ్ళలో వెలుగు కోటి కిరణాల సూర్య భగవానుడిలా తోచింది. ఉదయ భానుడికి భక్తిగా నమస్కరించింది ప్రభవ. ప్రకృతి కన్య కోటి గొంతులతో భాస్కరునికి స్వాగత గీతిక పాడుతోంది ఆ పల్లెని ఉదయాన........

## ఉగాది కార్టూన్ల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కార్టూనిస్ట్ పరిచయం



అమ్మా నాన్నా పెట్టిన పేరు — సరస్వతుల రామనరసింహం.

గురువు పెట్టిన పొట్టిపేరు — 'సరసి'

పుట్టింది — పశ్చిమగోదావరి జిల్లా బోడపాడులో

ఉద్యోగం — సచివాలయం ప్రధాన పరిపాలన శాఖలో

ఇంతవరకు పాఠకులు క్షమించినవి — రెండువందల కార్టూన్లు, ముప్పై కథలు.

ఆశయం — పదిమంది నవ్వుకుని, పది కాలాలపాటు గుర్తుంచుకునే కార్టూన్లు వెయ్యాలని.

నా విజయాలవెనక వ్యక్తి — నా భార్య 'రత్నం':(ఇలా అనటం అన్నివిధాలా మంచిది)

దేశానికి నేనిచ్చింది — ఇద్దరు పిల్లలు చైతన్య, పుష్యమి.

బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'ఉదయం వీక్లీ'కి కృతజ్ఞతలు.

భవదీయుడు

స.రామనరసింహం

### పోటీకార్టూన్లు : ఎస్. రామనరసింహం (సరసి)

